# ఇంటర్వ్యూ

ఆ ఫైలు అన్యమనస్కంగా, అసహనంగా తీశాడు ఆఫీసరు. బయట ఆరుగురు ఇంటర్వ్యూకోసం వేచివున్నారు. వాళ్ళని పరీక్షించాలి. అదంతా కేవలం ఆచారం - అంతే - అందుకే ఏదో పని ముగించుకుందామనే ధ్యాసలో వున్నాడాయన.

మొదటి అప్లికేషన్ తీసి పిలవమన్నాడు. ఆ నిరుద్యోగి వినయంగా వచ్చి నిలబడ్డాడు.

"నీ పేరు" ఏదో అడగాలని అడిగాడు. ఆ కళ్ళల్లో చురుకుతనం లేదు. ఎదుటివారు చెప్పేది వినే ఉద్దేశం కూడా లేదు. వెలగని ఎలక్ట్రిక్ బల్బుల్లా వున్నాయి ఆ కళ్ళు.

"నా పేరు పేరి శాస్త్రండి. మాది చాలా పెద్ద కుటుంబం. మా నాన్నగారు పోయి నాలుగేళ్ళయింది. నేను బి.ఏ. ప్యాసయి మూడేళ్ళు అయింది. యిద్దరు తమ్ముళ్ళు, యిద్దరు చెల్లెళ్ళు, తల్లి, అందరినీ నేనే పోషించాలి. అందుకే కనీసం యిదైనా...." అవకాశం దొరికిన మేరకు తన గోడంతా వెళ్ళబోసుకున్నాడా అమాయకుడు.

"ఊ..." మూలిగాడు ఆఫీసరు. అది గుహలోంచి సింహం మూలిగినట్లుంది. పేరిశాస్త్రి భయపడ్డాడు.

"మీరిక వెళ్ళొచ్చు" అన్నాడాయన.

"సార్"

"ఐ విల్ సీ, యు కెన్ గో"

పేరిశాస్త్రి చేసేది లేక బయటకొచ్చేశాడు.

రెండో పేరు వెంకటరత్నం - నల్లగా, బొద్దుగా పొట్టిగా వున్న అతన్ని అనవసరంగా హైరానా పెట్టడం ఇష్టంలేక పేరూ, ఊరూ, చదువూ (అన్నీ అప్లికేషన్‌లో వున్నా గాని) అడిగి పంపేశాడు. ఆఫీసరులో సహనం అప్పుడే నశించిపోయింది. అప్లికేషన్లు అన్నీ ఒక్కసారి తిరగేసి కోపంతో వూగిపోయాడాయన. అయినా తమాయించుకుని, నరసింహరాజుని పిలిచాడు. కుర్రాడు ముచ్చటగా వున్నాడు. చామనచాయ, సూటిముక్కు నున్నటి ముఖం, ఉంగరాలు తిరిగిన జుట్టు - కాని తనకి కావలసింది అదికాదు కదా అని రెండు ముక్కలతో ముగించాడు. బ్రతికి చెడిన నరసింహరాజు బయటపడ్డాడు.

వెంకటేశ్వరరావు, యు.బి.వి. చౌదరిగారి దగ్గర నుంచి సిఫారుసుతో వచ్చాడు. సిఫారసు ఉత్తరం చదివి, ఏమీ అనలేక -

"ఐ విల్ కన్‌సిడర్ యు ఫర్ ఎ బెటర్ పోస్టు" అని పంపేశాడు.

వరహాలు వస్తూనే వినయంగా నమస్కారాలు చేసినా వరుసగా అయిదు ప్రశ్నలడిగా ఆఖరివాడిని పిలిచాడు ఆశవిడిచిన ఆఫీసరు.

కడవాడిని గడగడ లాడించి పంపేసి హెడ్ గుమాస్తాని పిలిచి చర్రున లేచాడు ఆఫీసరు.

"ఏమయ్యా, ఇంట్లోకి మంచి గుడ్డులు వుతికేవాడు కదా కావాలని యీ వ్యూను పోస్టుకి యింటర్ వ్యూ పెట్టింది" అంటూ ఫైలు విసిరి కొట్టాడు.

ఆఫీసరు చెప్పిన అన్ని మాటల్లో ఆ మాటే మర్చిపోయిన గుమాస్తా బుర్ర గోక్కుంటూ బయటకొచ్చేశాడు!

(ఆంధ్ర సచిత్రవారపత్రిక నుండి)